క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి ఏఈ శాంత కుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ ఎస్ఎంఎస్, నిజాంపేట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బాచుపల్లి సిగ్నల్స్, శిఖర విల్లాస్, ప్రభుత్వ పాఠశాల, పోలీస్‌స్టేషన్, శ్రీనివాస లేక్‌వ్యూ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ధోలారీ ధనీ ఫీడర్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ ధోలారీ ధనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పోచమ్మగడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, ధోలారీధనీ రోడ్డు, కొంపల్లి స్మశానగడ్డ, హార్లిక్స్ స్ట్రీట్, భారత్ పెట్రోల్ బంక్, ఎస్ఎస్ఆర్, చంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్ సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం..



చెక్కును అందజేస్తున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్: ఆలయాల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ గ్రామంలో పోచమ్మతల్లి ఆలయాన్ని పునర్ నిర్మిస్తున్నారు. సదరు నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన రూ.1,01,116 చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు హన్మంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల కృష్ణాయాదవ్, లద్దిపీర్ల నర్సింగ్‌గౌడ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, మహేశ్ యాదవ్, బండారి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి



బీఎల్‌ఓలతో సమావేశమైన దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: యువత ఓటరు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ కోరారు. మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో గురువారం ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఆన్‌లైన్, నేరుగా కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్న ఫారాలు 6, 7, 8, 8ఏలను పరిశీలించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలన్నారు. అదే విధంగా శుక్రవారం నుంచి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు దరఖాస్తు చేసుకునేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు సంక్షేమ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

కుత్బుల్లాపూర్ జోన్ బృందం: రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. కొత్తగా వచ్చిన కుత్బుల్లాపూర్, బాచుపల్లి, గండిమైసమ్మ-దుండిగల్ మండలాల తహసీల్దార్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల సిబ్బంది వారికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మద్యం... లాటరీ

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

- మేడ్చల్ సూపరింటెండెంట్ పరిధిలో 114 మద్యం షాపులకు టెండర్లు
- మద్యం దుకాణాల ఏర్పాటుకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 21వ తేదీన లాటరీ సిస్టం ద్వారా ఎంపిక



ఎక్సైజ్ సూపరింటెండెంట్ **విజయ భాస్కర్**



కుత్బుల్లాపూర్: వచ్చే రెండేళ్లకు ఏ4 (వైన్) షాపులకు లైసెన్సులు కేటాయించే ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 4 నుంచి ప్రారంభమవుతుందని మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ... మేడ్చల్ సూపరింటెండెంట్ పరిధిలో మొత్తం 114 మద్యం షాపులకు టెండర్లు నిర్వహిస్తున్నామన్నారు. అందులో 17 దుకాణాలను వివిధ కేటగిరీల వారీగా ఎంపిక చేశామని పేర్కొన్నారు. పారదర్శకంగా సాగే ఈ టెండర్ల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చన్నారు. 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం ఈనెల 21వ తేదీన లాటరీ సిస్టం ద్వారా మద్యం దుకాణాలను ఎంపిక చేస్తామని తెలిపారు.

రిజర్వేషన్ల వారీగా మద్యం దుకాణాలు...

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, గౌడ్ కులాలకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో గతంలో మాదిరిగానే 2023–25 ఆర్థిక సంవత్సరంలో సైతం లాటరీ ద్వారా ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరించే ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా బాలానగర్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ పరిధిలో 17 మద్యం దుకాణాలను ఈ కేటగిరిలో చేర్చి లక్కీ డ్రా తీశారు. ఆయా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల వారీగా పరిశీలిస్తే ఇలా ఉన్నాయి.

◆ బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ మద్యం దుకాణం క్రమ సంఖ్య 12, 17, 31, 32 (గౌడ్), 25, 35(ఎస్సీ) కేటాయించారు.

◆ కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 54, 58, 72, 82 (గౌడ్), 65, 77 (ఎస్సీ) 73 (ఎస్టీ) ఎంపిక చేశారు.

◆ మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 101, 103, 111 (గౌడ్), 107 (ఎస్సీ) కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గతంలో పోటాపోటీ దరఖాస్తులు..

కుత్బుల్లాపూర్, బాలానగర్, మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడం విశేషం. మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ నేతృత్వంలో ఇక్కడ ఏకంగా 3609 దరఖాస్తులు రావడం విశేషం.

◆ 2023–25 ఆర్థిక సంవత్సరంలో ఎన్ని దరఖాస్తులు వస్తాయన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. నవంబర్, డిసెంబర్ ఎన్నికల వాతావరణం ఉంటున్న నేపథ్యంలో అమ్మకాలు భారీగా పెరిగే అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం టెండర్లు ముందస్తుగా మూడు నెలల ముందే జరపడం, పోటీదారులు ఎంతమంది వస్తారు. అన్న విషయంపై ఇప్పుడు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

నాగోలులో దరఖాస్తుల స్వీకరణ...

◆ మూడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో దరఖాస్తుల స్వీకరణ ఈనెల 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా నాగోల్ బండ్లగూడలో ఉన్న అనంతుల రాంరెడ్డి గార్డెన్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అక్కడే రూ.2 లక్షల డీడీలను ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 21వ తేదీ నాడు అక్కడే లక్కీ డ్రా నిర్వహిస్తామని మేడ్చల్ ఎక్సైజ్ సూపరిండెంట్ విజయభాస్కర్ తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రగతియాత్ర చేపట్టాం



కుత్బుల్లాపూర్: అభివృద్ధే లక్ష్యంగా ప్రగతియాత్ర చేపట్టానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం సూరారం డివిజన్ పరిధిలోని కళావతినగర్, టీఎస్ఐఐసీ కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే రూ.84.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి, డీఈఈ శిరీష, ఏఈ సంపత్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, నాయకులు చెక్క సురేష్‌బాబు, గిరిధర్, మధు మోహన్, నేతి రాజు, సాయి బాబా, శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, యాదగిరి, మహేష్, శ్రీను, ముకుందం తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి గురై కార్మికుడు మృతి



సఖిల్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాకు చెందిన సఖిల్ ముర్ము (19) నగరానికి వలస వచ్చి కొంపల్లి నూజివీడు సీడ్స్ కంపెనీ సమీపంలోని మైరో కన్‌స్ట్రక్షన్స్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. నిర్మాణం జరుగుతున్న భవనం సెల్లార్‌లోకి ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి చేసింది. గురువారం ఉదయం భవనంలోని సెల్లార్‌లో ఉన్న విద్యుత్ మీటర్‌ను ఆన్ చేస్తుండగా సఖిల్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్‌లో త్రిముఖ పోటీ

- టికెట్ తనదేనంటున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి



సొంటిరెడ్డి పున్నారెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీలో టికెట్ విషయంలో త్రిముఖ పోటీ నడుస్తోంది. ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు చేపడుతూ టికెట్ తనకే వస్తుందని ప్రచారం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరవుతూ వస్తున్నా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి మొదటి నుంచి జగ్గారెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందాడు. అయితే ఇటీవల టీపీసీసీ ఎన్నికల కమిటీలో జగ్గారెడ్డికి కీలక స్థానం ఇవ్వడంతో పున్నారెడ్డి తనకి టికెట్ వస్తుందని ప్రచారంలో మునిగితేలాడు.

◆ అంతేకాకుండా ఇప్పటికే క్షేత్రస్థాయిలో డివిజన్ల వారీగా వార్డు స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ పోలింగ్ ఏజెంట్ల నియమించుకోవడంలో నిమగ్నం కావడం విశేషం. అదేవిధంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నర్సారెడ్డి భూపతి రెడ్డితో పాటు, టీపీసీసీ ప్రతినిధి హనుమంతరెడ్డి సైతం తనకే టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఇప్పటికే పార్టీ కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నారు. ఇలా ఎవరికి వారే ప్రచారంలో మునిగి తేలడంతో కార్యకర్తలు అయోమయంలో పడుతున్నారు. ఏ నాయకుని వెంట తిరిగితే మరో నాయకుడికి దూరం అవుతామన్న భయంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

ఎంబీఏఆర్ కంపెనీ ఎన్నికల్లో మర్రి రాజశేఖర్‌రెడ్డి విజయం



ఎంబీఏఆర్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మర్రి రాజశేఖర్‌రెడ్డి

రంగారెడ్డినగర్: గాంధీనగర్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని ఎంబీఏఆర్ టెక్నాలజీస్ కంపెనీ యూనియన్ ఎన్నికల్లో బీఆర్‌టీయూ నుంచి అధ్యక్షుడిగా పోటీ చేసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన తన సమీప ప్రత్యర్థి బీఎంఎస్ నుంచి పోటీ చేసిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందర్‌రావుపై విజయం సాధించారు. రాజశేఖర్‌రెడ్డికి 214 ఓట్లు రాగా రఘునందనరావుకు 195 ఓట్లు, సీఐటీయూ అభ్యర్థికి 90 ఓట్లు పడ్డాయి. దీంతో 19 ఓట్ల మెజార్టీతో బీఆర్‌టీయూ అభ్యర్థి రాజశేఖర్‌రెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనను యూనియన్ అధ్యక్షుడిగా గెలిపించిన కార్మికుల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. తన గెలుపు కోసం పని చేసిన ఎమ్మెల్యే వివేకానంద్, యూనియన్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

'ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయి'



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజును సత్కరిస్తున్న కాలనీల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ, మండలి విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు గురువారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయానికి వచ్చి సమస్యలను ఏకరవు పెట్టారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ. వర్షాలతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు ప్రభుత్వం తప్పకుండా అండగా ఉంటుందన్నారు. ఈ సమయంలో కూడా రాజకీయాలు చేసే నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దశలవారీగా అభివృద్ధి మౌలిక వసతులు కల్పిస్తూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష నాయకులు రాజకీయ ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.

వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయం



వరద బాధితుల కోసం సేకరించిన నిత్యావసరాలను పరిశీలిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: వరద బాధిత ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. 9వ డివిజన్ కార్పొరేటర్ రజిత స్థానిక కాలనీలు, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ల సహకారంతో భారీ వర్షాలతో నీట మునిగిన ములుగు జిల్లాలోని పలు గ్రామాల ప్రజలను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. దాతల సహాయంతో సమకూర్చిన బియ్యం, నిత్యావసరాల వస్తువులు, బట్టలు, దుప్పట్లు తదితర సామగ్రిని బాధితులకు పంపిణీ చేయడానికి గురువారం తరలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికాంత్, దుండగుల స్వామి, ప్రవీణ్, శశి, దుర్గారెడ్డి, ఫణికుమార్, రాజు, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్

దుండిగల్: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అని.. రైతుల కోసం సీఎం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని బౌరంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తు గురువారం సొసైటీ కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 29.61 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. గతంలో రూ.17,351 కోట్ల రుణమాఫీ కాగా ఈ దఫా రూ.19 వేల కోట్లు మాఫీ అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శంకర్‌నాయక్, సాయియాదవ్, నాయకులు బుచ్చిరెడ్డి, మురళి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, జీతయ్య, కృష్ణయ్య, వెంకటేశ్, మహిపాల్, రంగయ్య పాల్గొన్నారు.

◆ **కుత్బుల్లాపూర్:** రైతు రుణమాఫీని పునః ప్రారంభించడంలో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్యే వివేకానంద్ సూచనతో గురువారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి నేతలు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని కాపాడుతోందని అన్నారు.

దూలపల్లిలోని పీఏసీఎస్ బ్యాంక్ వద్ద...

సుభాష్‌నగర్: సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ చేసిన నేపథ్యంలో గురువారం దూలపల్లిలోని పీఏసీఎస్ బ్యాంక్ వద్ద చైర్మన్ గరిగె నరేందర్ రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బ్యాంక్ వైస్‌చైర్మన్ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు మధుసూదన్, సత్యనారాయణ, మల్లేష్, కృష్ణ, శ్రీనివాస్, జెమ్మి నాగమణి, సావిత్రి, మదన్‌రావు, రైతులు పాల్గొన్నారు.





సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు,



పాలాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ గరిగె నరేందర్‌రాజు

నిజాంపేట్‌లో అభివృద్ధి కన్నా

కబ్జాలే ఎక్కువ

- కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల సతీష్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కన్నా కబ్జాలే ఎక్కువగా జరిగాయని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. గురువారం జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కార్పొరేషన్ ప్రజలు రూ.55 కోట్లను వివిధ పన్నుల రూపంలో చెల్లిస్తున్నారని.. అయితే గడిచిన మూడేళ్లలో కనీసం రూ.10 కోట్ల నిధులైనా వెచ్చించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కార్పొరేషన్‌కు కేటాయించిన స్వచ్ఛభారత్, నర్సరీలకు సంబంధించిన నిధులు, అదే విధంగా 14, 15 ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను ఎందుకు ప్రభుత్వం విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. కార్పొరేషన్‌కు 45 ఎంఎల్ తాగునీరు అవసరం ఉండగా 22 ఎంఎల్ నీరు మాత్రమే సరఫరా అవుతోందన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే వివేకానంద్ ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు.

◆ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌పై బీఆర్ఎస్ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని.. దమ్ముంటే మేము అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. జీఎన్‌టీయూ నుంచి బాచుపల్లి వరకు 100 మీటర్ల రోడ్డుపై మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. బాచుపల్లి నుంచి మల్లంపేట్ వరకు 100 ఫీట్ల రోడ్డును అధికార పార్టీ నేతల భవనాలకు నష్టం వాటిల్లకుండా 60 ఫీట్లకు కుదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. త్వరలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే ఫైల్స్ పేరుతో ప్రజలను జాగృతం చేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కాశీ, కార్పొరేషన్ కార్యదర్శి శేషారావు, సుధాకర్ రెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ సురేష్, ఉదయ్, విజయ్ కుమార్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సికింద్రాబాద్ ప్యాట్నీ నుంచి కండ్లకోయ వరకు.. అదే విధంగా మియాపూర్ నుంచి ఇస్నాపూర్, ఎల్బీనగర్ నుంచి పెద్ద అంబర్‌పేట్, ఉప్పల్ నుంచి బీబీనగర్ వరకు, తార్నాక నుంచి ఈసీఐఎల్ వరకు మెట్రో రైలును విస్తరిస్తున్నట్లు కేబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో గురువారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా రైతు రుణమాఫీ చేయడంపై ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు



రూ.4.25 లక్షల చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బౌరంపేటలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి(భౌరమ్మగుడి) ఆలయంలో నూతనంగా ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నారు. అందుకు రూ.4.25 లక్షలను శ్రీనివాస్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి పురాతనమైన భౌరమ్మ గుడి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటులో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారీ పవన్ శర్మ, మిద్దెల మల్లారెడ్డి, కైలాష్, అంజయ్య, బుచ్చిరెడ్డి, సర్గారి సురేందర్‌రెడ్డి, శంకరప్ప, బింగి నాగరాజు, మన్నె శేఖర్, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేట..



పైపులైన్ రోడ్డులో భూమి కుంగిన ప్రదేశం నుంచి పెద్ద మొత్తంలో రోడ్డుపైకి వచ్చి చేరుతున్న నీరు



చేపల కోసం పోటీ పడుతున్న స్థానికులు

సుభాష్‌నగర్: జీడిమెట్ల విలేజ్ 44వ జాతీయ రహదారి నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో డ్రైనేజీ నీటికి, ఫాక్స్‌సాగర్ నీరు తోడై ఉధృతంగా ప్రవహిస్తోంది. జులై 24న రెండు మీటర్ల వెడల్పు, మూడు మీటర్ల లోతుతో భూమి కుంగిపోయింది. ఈ విషయమై సాక్షి వెలుగులోకి తీసుకురాగా మరుసటి రోజు 25న అధికారులు వచ్చి పరిశీలించారు. గత రెండు రోజుల నుంచి భూమి కుంగిపోయిన ప్రదేశం నుంచి భూగర్భ డ్రైనేజీ ఉండటంతో పాటు కొంత ఫాక్స్‌సాగర్ నుంచి వచ్చిన నీరు కలవడంతో నీరు రోడ్డుపై నుంచి పెద్ద మొత్తంలో ప్రవహిస్తోంది. దీనికి తోడుగా ఫాక్స్‌సాగర్ నుంచి చేపలు రావడంతో పట్టుకోవడానికి స్థానికులు పోటీపడ్డారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చిన్నారి మృతి కారణమైన డ్రైవర్, యజమానిపై కేసు

నిజాంపేట్: స్కూల్ బస్సు ఢీకొట్టిన ఘటనలో చిన్నారి మృతి చెందగా, ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్, యజమానిపై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాచుపల్లిలోని ఇంద్రప్రస్థా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కిశోర్, పద్మ దంపతుల పెద్దకుమార్తె దీక్షిత (3) భౌరంపేట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతోంది. ఈ నెల 2వ తేదీన ఉదయం దీక్షితను స్కూల్‌లో దింపేందుకు స్కూటీపై కిశోర్ తీసుకు వెళ్తుండగా రెడ్డీ ల్యాబ్స్ సమీపంలో నిజాంపేట్ బాష్యం స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ రహీంతో పాటు బస్సు ఫిట్‌నెస్ సక్రమంగా లేని కారణంగా యజమాని దేవేందర్‌నగర్‌కు చెందిన సత్యం రాజులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్యకేసులో నలుగురి అరెస్టు

సుభాష్‌నగర్: హత్యకు గురైన మహిళ కేసును సూరారం పోలీసులు 24 గంటల్లో చేధించారు. సూరారం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గండి మైసమ్మ సమీపంలోని డాక్టర్ బస్తీలో నివాసముండే రేణుక (32), సురేష్‌లు భార్యాభర్తలు. కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో రేణుక తన భర్తను హత్య చేసింది. జైలుకు వెళ్లిన ఆమె ఇటీవల బెయిల్‌పై విడుదలైంది. ఈ క్రమంలో గండిమైసమ్మలో ఓ ప్రైవేట్ స్కూల్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న సాయి అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది.. అయితే ఈనెల 2వ తేదీన రేణుకను హత్య చేసి సూరారం గ్రామ శివారులోని చిన్న బంధం చెరువు కట్టపై వేశారు.

◆ ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతురాలు మొబైల్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కాల్స్ లిస్ట్‌లో మొదటి భర్త సురేష్ తమ్ముడు విశ్వకర్మకాలనీలో ఉండే నరేష్(27) ఫోన్‌కాల్ ఉండటంతో అనుమానం వచ్చిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించారు.

◆ తన అన్నను హత్య చేసిన రేణుకను అంతమొందించేందుకు పథకం రచించామన్నారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి తన స్నేహితులు, రేణుకతో మందు పార్టీ చేసుకున్నామని వెల్లడించాడు. మద్యం మత్తులో ఉన్న రేణుక మెడకు తాడుతో ఉరి వేశామన్నారు. అయినా చనిపోలేదని గ్రహించి తలను నెలకు మోది అనంతరం ముఖంపై దిండుతో అదిమి ఊరిరాడకుండా చేసి హత్య చేసినట్లు అంగీకరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆటోలో మృతదేహాన్ని తరలించి సూరారం బంధం చెరువు గట్టుపై పడేసి వెళ్లామన్నారు.

◆ ఈ హత్యలో నలుగురు పాలుపంచుకోగా వారిలో ఒకరు మైనర్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సూరారం దయానంద్‌నగర్‌కు చెందిన బండారు సాయి (19), మన్నె పద్మ(30)లతో పాటు నరేష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపగా, మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తరలించారు.